క్లుప్తంగా

పిల్లలకు టీషర్టుల పంపిణీ



పంపిణీ చేసిన టీషర్టులతో పిల్లలు

మొగుళ్లపల్లి: వేములపల్లి గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపులో పాల్గొన్న పిల్లలకు గంగాకావేరి సీడ్స్ వారి ఆధ్వర్యంలో బొద్దిరెడ్డి రాజిరెడ్డి పిల్లలకు టీషర్టులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ క్రీడాకారులు మల్లయ్య, చంద్రారెడ్డి, ధర్మారెడ్డి, రాజు, కోచ్ గుత్తికొండ సాంబయ్య పాల్గొన్నారు.

కమిటీల నియామకం



కమిటీ సభ్యులతో పృథ్వీరాజ్

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని సుభాష్ కాలనీ 17వ వార్డులో కాంగ్రెస్ పార్టీ వార్డు కమిటీని గురువారం ఎన్నుకున్నట్లు వార్డు ఇన్‌చార్జ్ బీర్తి పృథ్వీరాజ్ తెలిపారు. అధ్యక్షుడిగా వైనాల కిరణ్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ శనవేన ఓదెలు, ప్రధాన కార్యదర్శిగా అంబటి రాజు, ఉపాధ్యక్షుడిగా శ్రీపతి రవీందర్ ఎన్నుకున్నట్లు వెల్లడించారు. అలాగే తొమ్మిదవ వార్డును ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని పార్టీ జిల్లా నాయకుడు అప్పం కిసన్ తెలిపారు. అధ్యక్షుడిగా గసిగంటి భద్రయ్య, ఉపాధ్యక్షుడిగా దానవేణి రమేష్, ప్రధాన కార్యదర్శిగా శెట్టి రవీందర్, కార్యదర్శిగా సామల లక్ష్మారెడ్డి, సహాయ కార్యదర్శిగా అంకం రామ్మూర్తి, కోశాధికారిగా సాదు సదానందం, కమిటీ సభ్యులుగా పోతరాజు రామస్వామి, దుగ్యాల నారాయణరావు, గట్టు రమేష్, మొగిలి గట్టయ్య ఎన్నికైనట్లు ప్రకటించారు.

ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను కలిసిన జంపన్న



ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌తో నాయకులు

ములుగు రూరల్: బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను నియోజకవర్గ నాయకుడు భూక్య జంపన్న హనుమకొండలోని హరితహోటల్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు ములుగు జిల్లాలో పార్టీ విషయాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో వెంకటాపురం మండల అధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, కొత్తగూడెం మండల అధ్యక్షుడు కొమ్మనబోయిన వేణుయాదవ్, గోవిందరావుపేట మండల అధ్యక్షుడు నరసింహనాయక్, మధుసుదన్‌రెడ్డి, రాజేందర్, నెహ్రూనాయక్, సురేష్‌నాయక్, అలీమియా, రాజ్‌కుమార్, పూర్ణచందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

గుంతల రోడ్డుకు మరమ్మతులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని వీఆర్‌కే పురం పంచాయతీ, చొక్కాల గ్రామంలో రోడ్డు గుంతలమయంగా మారి నడిచేందుకు వీలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుకు కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు దర్ర రవి సొంత ఖర్చులతో మరమ్మతులు చేయించాడు. గ్రామ పంచాయతీ అధికారుల సహకారంతో పంచాయతీ ట్రాక్టర్‌తో గ్రామంలోని రోడ్డుకు గ్రావెల్ తరలించి రోడ్డుకు మరమ్మతు పనులు నిర్వహించారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

శంకుస్థాపన చేసి వదిలేశారు..

- గాంధీనగర్ వెళ్లే రోడ్డు అధ్వానం
- కంకర తేలి ప్రయాణం నరకం
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

రేగొండ: కొత్తపల్లిగోరి మండల పరిధిలోని కొత్తపల్లి (కె) నుంచి గాంధీనగర్ వెళ్లే రోడ్డు కంకర తేలి అధ్వానంగా మారడంతో రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. రాత్రివేళల్లో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు చోటుచేసుకున్న సంఘటనలు ఉన్నాయి. దీంతో ఈ దారిగుండా ప్రజలు ప్రయాణం చేయాలంటేనే భయపడుతున్నారు. గత ప్రభుత్వం గాంధీనగర్ గ్రామాన్ని నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసింది. కాగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత 2024లో గ్రామపంచాయతీ భవన నిర్మాణానికి రూ.20 లక్షల అంచనా వ్యయంతో, జనవరిలో రెండు గ్రామాల మధ్య రోడ్డు నిర్మాణానికి రూ.1.46 కోట్ల అంచనా వ్యయంతో శంకుస్థాపన చేశారు. కానీ పనులు ప్రారంభించకపోవడంతో స్థానిక ప్రజలు మండిపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.





రోడ్డు నిర్మాణం కోసం వేసిన శిలాఫలకం, కంకర తేలిన గాంధీనగర్ రోడ్డు

అభివృద్ధి చేయాలి



నూతన గ్రామ పంచాయతీగా ఏర్పాటవడంతో గ్రామం అభివృద్ధి చెందుతుందని ఆశించాం. గ్రామ పంచాయతీ భవనానికీ, బీటీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేసి నిర్మించడం లేదు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ చూపి అభివృద్ధి చేయాలి.

- దండెబోయిన సంతోష్, మాజీ సర్పంచ్

కంకర రోడ్డుతో అవస్థలు



కొత్తపల్లి నుంచి గాంధీనగర్ వెళ్లే రోడ్డు సరిగా లేక అవస్థలు పడుతున్నాం. రోడ్డు కంకర తేలి, గుంతలమయంగా మారి ప్రమాదకరంగా ఉంది. దీంతో వాహనాలు పాడవుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మించాలి.

- ఇప్పకాయల రాజయ్య, గాంధీనగర్

బొడ్రాయి ప్రతిష్ఠాపన వేడుకలు



జలాభిషేకానికి వస్తున్న గ్రామస్తులు

వాజేడు: మండలంలోని పేరూరులో బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. గంగ పూజ, గణపతి హోమం, గ్రామ దేవతలకు పూజలను నిర్వహించారు. మధ్యాహ్నం శాస్త్రోక్తంగా యాగ శాలను ప్రారంభించారు. సాయంత్రం విగ్రహాలకు జలాభిషేకం చేసి నీటిలో ఉంచారు.

ప్రహరీ నిర్మాణానికి భూమిపూజ

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి ఆలయానికి ప్రహరీ నిర్మాణం కోసం గురువారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇర్సవడ్ల వెంకన్న, మండల అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ.. మంత్రి సీతక్క, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్ సూచనలతో మండల కేంద్రంలోని ఎస్‌డీఎఫ్ రూ.10 లక్షలు నిధుల ద్వారా మంజూరైన రామాలయం ఆయల ప్రహరీ పనులను ప్రారంభించామన్నారు. ఆలయ అభివృద్ధి కోసం పాటుపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, జిల్లా కార్యదర్శి గుడ్ల దేవేందర్, ముక్కెర లాలయ్య, బాలరాజు, రియాజ్, వావిలాల ఎల్లయ్య, సర్వ అక్షిత్, గౌస్‌పాషా, లక్కి, సాయి, ముమ్మనేని రమేశ్, గద్దల నవీన్, మామిడి రాంబాబు, తరుణ్, రతన్, రామాలయం కమిటీ చైర్మన్ అలువాల శ్రీనివాస్, కోశాధికారి తాడూరి దీనబాంధవస్వామి, ప్రధాన కార్యదర్శి కత్తెర శ్రీనివాస్‌తోపాటు అర్చకుడు యల్లాప్రగఢ నాగేశ్వర్‌రావుశర్మ పాల్గొన్నారు.



ప్రహరీకి భూమి పూజ చేస్తున్న నాయకులు

ప్రమాదకరంగా ఎండిన చెట్టు..

టేకుమట్ల: మండల కేంద్రంలోని టేకుమట్ల–ఆశిరెడ్డిపల్లి ప్రధాన రోడ్డులో చెట్టు ఎండిపోయి ప్రమాదకరంగా మారింది. ప్రధాన రోడ్డు పక్కనే ఉండడంతో గాలికి పడిపోతుందోనని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే చిన్న చిన్న గాలికి చెట్టు కొమ్మలు విరిగి పడుతున్నాయి. ఇటీవల రోడ్డు పక్కనే ఇద్దరు వ్యక్తులు మాట్లాడుకుంటున్న సమయంలో చెట్టు కొమ్మ విరిగి వారి పక్కనే పడడంతో ప్రమాదం తప్పింది. అంతే కాకుండా చెట్టు పక్కనే విద్యుత్ వైర్లు ఉండడంతో వర్షాకాలంలో గాలివానలకు చెట్టు కొమ్మలు విద్యుత్ వైర్లపై పడితే విద్యుత్ స్తంభాలు సైతం విరిగి పెద్ద ప్రమాదమే సంభవించే అవకాశం ఉంది. కావున అధికారులు స్పందించి ప్రమాదాల బారిన ఎవరూ పడకముందే చెట్టును తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



టేకుమట్లలో రోడ్డు పక్కన ఎండిన చెట్టు

కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న నాయకులు

ములుగు రూరల్: మలి దశ తెలంగాణ ఉద్యమం కోసం అనునిత్యం పోరాడిన యోధుడు మారోజు వీరన్న వర్ధంతిని జిల్లా కేంద్రంలో సీపీయూఎస్ఐ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని సంఘం రాష్ట్ర కార్యదర్శి దైద వెంకన్న అన్నారు. ఈ మేరకు గురువారం జిల్లా కేంద్రంలోని అమరవీరుల స్థూపం వద్ద కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 31న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న వీరన్న వర్ధంతికి ప్రజలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ములుగు, భూపాలపల్లి జిల్లా సీపీయూఎస్ఐ జిల్లా కార్యదర్శి వావిలాల లక్ష్మణ్, గట్ల రాజన్న, ముంజాల భిక్షపతిగౌడ్, రఘు తదితరులు పాల్గొన్నారు.

మహిళకు గాయాలు



చికిత్స పొందుతున్న సమ్మక్క

వెంకటాపురం(కె): ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళ తలకు తీవ్ర గాయమైన సంఘటన గురువారం చోటు చేసుకుంది. ప్రయాణికులు తెలిపిన కథనం ప్రకారం.. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం కొయ్యూరు గ్రామ నుంచి వెంకటాపురం మండలానికి వచ్చేందుకు సమ్మక్క ఆర్టీసీ బస్సు ఎక్కింది. కాగా వేగంగా వస్తున్న బస్సు రామచంద్రాపురం గ్రామ సమీపంలోని పెద్ద గుంతలో ఎత్తేయటంతో బస్సులో ప్రయాణిస్తున్న సమ్మక్క ఒక్కసారిగా ఎగిరి పడటంతో తలకు తీవ్ర గాయామయింది. గాయమైన సమ్మక్కను వెంకటాపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించి చికిత్స నిర్వహించారు.

విద్యుత్ షాక్‌తో రైతుకు..



చికిత్స పొందుతున్న రైతు రాములు

కాటారం: కొనుగోలు కేంద్రంలో ధాన్యం తూర్పాల పడుతున్న రైతు విద్యుత్ షాక్‌కు గురై గాయాలపాలైన సంఘటన గురువారం మహాముత్తారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మహాముత్తారానికి చెందిన రాములు అనే రైతు గత కొన్ని రోజుల క్రితం పీఏసీఎస్ కొనుగోలు కేంద్రంలో ధాన్యం విక్రయానికి తీసుకొచ్చి ఆరబోశాడు. ఈ క్రమంలో ధాన్యం విక్రయ నిమిత్తం నిర్వాహకుల నిబంధనల మేరకు తూర్పాల పడుతున్నాడు. ఈ క్రమంలో తూర్పాల యంత్రంతో తూర్పాల పడుతుండగా ప్రమాదవశాత్తు రాములు విద్యుత్‌షాక్‌కు గురకైకలు వేశాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు అప్రమత్తమై యంత్రానికి విద్యుత్ సరఫరా అవుతున్న విద్యుత్ తీగలను తొలిగించారు. దీంతో రాములు ప్రాణాపాయ స్థితి నుంచి గాయాలతో బయటపడ్డాడు. స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత



పశువులు తరలిస్తున్న వాహనంతో పోలీసులు

కాటారం: మహాముత్తారం మండలం నుంచి ఇతర ప్రాంతానికి అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని గురువారం తెల్లవారుజామున కొర్లకుంట వద్ద బీజేపీ మండల అధ్యక్షుడు మేడిపల్లి పూర్ణచందర్ అడ్డుకున్నారు. అక్రమంగా పశువులు రవాణా చేయడాన్ని గమనించిన పూర్ణచందర్ వాహనాన్ని నిలిపి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు పశువులు తరలిస్తున్న వాహనాన్ని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఐదు పశువులను స్థానిక పశువైద్యాధికారులకు అప్పగించగా రాంపూర్ గోశాలకు తీసుకెళ్లారు. పశువులను తరలిస్తున్న వారిపై కేసు నమోదు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షుడు పూర్ణచందర్ మాట్లాడుతూ.. గోవుల అక్రమ రవాణా చేస్తే సహించేది లేదన్నారు. గోవుల పరిరక్షణ కోసం నిరంతరం పాటు పడుతామని పేర్కొన్నారు.

నాసిరకం విత్తనాలు అమ్మితే చర్యలు

- ఏఓ వాసుదేవరెడ్డి



స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న ఏఓ

రేగొండ: నాసిరకం విత్తనాలు అమ్మితే చట్టపరమైన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి వాసుదేవరెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని విత్తన దుకాణాలను తనిఖీ చేసి ఇన్వాయిస్, స్టాక్ రిజిస్టర్, బిల్లు బుక్కులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విత్తనాలను లైసెన్స్ కలిగిన డీలర్ల నుంచి కొనుగోలు చేసి, రసీదు పొంది, రసీదును పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరుచుకోవాలని సూచించారు. బీజీ 2 పత్తి విత్తనాలను గరిష్టంగా రూ.901 కంటే ఎక్కువ ధరకు విక్రయించే వారిపై పీడీ యాక్టు కింద కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు 60 నుంచి 70 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైన తర్వాతనే పత్తి విత్తనాలను నాటాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు మాళవిక, ప్రవీణ్, గోవర్ధన్, డీలర్లు పాల్గొన్నారు.

ఈపాస్ మిషన్ల అందజేత



ఈపాస్ మిషన్లు అందజేస్తున్న అధికారులు

కాటారం: వ్యవసాయశాఖ మహదేవపూర్ సబ్ డివిజన్ పరిధిలోని ఎరువుల డీలర్లకు గురువారం మండల కేంద్రంలోని రైతువేదికలో ఈపాస్ మిషన్లను అందజేశారు. వానాకాలం సీజన్ 2025కు సంబంధించి న్యూసాఫ్ట్‌వేర్ అప్‌డేటేషన్ చేసిన ఈపాస్ మిషన్లను ఆర్‌సీఎఫ్ కంపెనీ యాజమాన్యం ఆధ్వర్యంలో అందజేసినట్లు మహదేవపూర్ ఏడీఏ శ్రీపాల్ తెలిపారు. ఎరువుల విక్రయాలను ఆధార్ బయోమెట్రిక్ అనుసంధానంగా అప్‌డేట్ న్యూ మిషన్‌లలో చేయాలని డీలర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో భూపాలపలి ఏడీఏ బాబ్రు, కాటారం, మహదేవపూర్, మహాముత్తారం ఏఓలు పూర్ణిమ, సుప్రజ్యోతి, అనూష, ఏఈఓ రాజన్న, డీలర్లు పాల్గొన్నారు.

ఆటపాటలతో విద్య.. చిన్నారుల ఆసక్తి



పిల్లలతో ప్రదర్శన ఇప్పిస్తున్న ఎన్‌జీఓ సభ్యులు

కాటారం: ఆటపాటలతో విద్యను అందించడం ద్వారా చిన్నారులు ఆసక్తి కనబరుస్తారని ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ సమ్మయ్య, అంగన్‌వాడీ టీచర్ వీణా అన్నారు. మండలంలోని గంగారంలో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం పాఠశాల సంసిద్ధత మేళ నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల అభివృద్ధి గూర్చి తల్లుల ముందే పిల్లలతో ప్రదర్శింపజేయించారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా పిల్లలు నేర్చుకుంటున్న అంశాలపై తల్లులకు పూర్తి అవగాహన కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సులోచన, పుష్పలత, సునీత, ఆయాలు సారక్క, సుగుణ, పద్మ, కిశోర బాలికలు, తల్లులు, చిన్నారులు, ఎన్‌జీఓ సభ్యులు పాల్గొన్నారు.

పంపిణీకి సిద్ధంగా పాఠ్యపుస్తకాలు

మొగుళ్లపల్లి: ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల విద్యాశాఖ అధికారి లింగాల కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంలోని 37 ప్రభుత్వ పాఠశాలలకు ఈనెల 30 నుంచి ప్రధానోపాధ్యాయులు వారికి సూచించిన తేదీల్లో తీసుకెళ్లాలని సూచించారు. యుడీఐఎస్‌ఈ పోర్టల్‌లో నమోదు చేసిన విద్యార్థుల సంఖ్య ఆధారంగా మండలానికి 6960 పుస్తకాలు వచ్చాయన్నారు. ప్రాథమిక స్థాయి విద్యార్థులకు వర్క్ బుక్స్ రావాల్సి ఉందన్నారు. అలాగే 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు ఇప్పటికే పాఠశాలలకు నోట్ బుక్స్ ఇచ్చామన్నారు. ప్రధానోపాధ్యాయులు జూన్ 6 నుంచి నిర్వహించే బడిబాట కార్యక్రమంలో భాగంగా పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్స్‌ను విద్యార్థులకు అందజేయాలన్నారు.

నూగూరులో సమగ్ర భూ సర్వే



వెంకటాపురం(కె): సర్వే నిర్వహిస్తున్న అధికారులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని నూగూరు (జీ) గ్రామంలో రెవెన్యూ అధికారులు సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. గ్రామంలో భూ భారతి పైలెట్ ప్రాజెక్టుగా అధికారులు ఎంపిక చేయడంతో తహసీల్దార్ వేణు గోపాల్ ఆధ్వర్యంలో డ్రోన్‌ల సహాయంతో సమగ్ర భూ సర్వే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సర్వేతో భవిష్యత్‌లో భూ సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు ఉన్నారు.

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోండి

వాజేడు: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని వాజేడు తహసీల్దార్ శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వాజేడు మండలంలో జూన్ 3 నుంచి 13 వరకు రెవెన్యూ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రగళ్లపల్లి, నాగారంలో జూన్ 3, ప్రగళ్లపల్లి, గుమ్మడిదొడ్డిలో జూన్ 4, జగన్నాథపురం, చెరుకూరులో జూన్ 5, పూసూరు,పెద్ద గొళ్లగూడెంలో జూన్ 6, టేకులగూడెం, దూలాపురం, చింతూరులో జూన్ 9, చంద్రుపట్ల, పేరూరులో జూన్ 10, చీకుపల్లి, కృష్ణాపురలో జూన్ 11, ఏడ్జెర్లపల్లి, అయ్యావారి పేటలో జూన్ 12, ధర్మవరంలో 13న ఈ సదస్సులు నిర్వహించనున్నట్లు వెల్లడించారు.

కేసు నమోదు

ములుగు రూరల్: మండలంలోని జంగాపల్లి క్రాస్‌రోడ్డులో భార్య సౌందర్యను హత్య చేసిన కేసులో భర్త సంగరబోయిన లక్ష్మయ్యపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలి పారు. బుధవారం రాత్రి మృతురాలి కుమారు డు అజయ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేశామని అన్నారు. లక్ష్మయ్య పరారీలో ఉండగా గురువారం మడికొండ సమీపంలో పురుగుల మందు తాగి బంధువులకు సమాచారం ఇచ్చాడు. బంధువులు లక్ష్మయ్యను ఎంజీఎంకు తరలించి చికిత్స అందిస్తున్నారు. లక్ష్మయ్య ఆరోగ్యంపై ములుగు పోలీసులు వైద్యులతో మాట్లాడి విషయం తెలుసుకున్నారు. లక్ష్మయ్య కొలుకున్న వెంటనే అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరుస్తామని ఎస్సై తెలిపారు.

సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతుండగా..

- విద్యుత్‌షాక్‌తో ఒకరి మృతి



బాపురెడ్డి (ఫైల్)

కాటారం: సెల్‌ఫోన్ చార్జింగ్ పెడుతూ ప్రమాదవశాత్తు విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తి చెందిన సంఘటన కాటారం మండల కేంద్రంలోని బొమ్మనగూడెంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బొమ్మన బాపురెడ్డి(52) బుధవారం అర్ధరాత్రి సెల్‌ఫోన్‌ను చార్జింగ్ పెట్టడానికి కరెంట్ బోర్డు వద్దకు వెళ్లాడు. చార్జింగ్ పెడుతున్న క్రమంలో కరెంట్ బోర్డుపైన చేతు పడి విద్యుత్‌షాక్‌కు గురై కింద పడ్డాడు. పెద్ద శబ్దం రావడంతో గమనించిన కుటుంబ సభ్యులు బాపురెడ్డిని చికిత్స నిమిత్తం 108 ద్వారా భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి బాపురెడ్డి మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమారుడు, కూతురు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పీఎస్సై గీతారాథోడ్ తెలిపారు.

ఆశతో దరఖాస్తుదారులు

- రాజీవ్ యువ వికాసం పథకానికి దరఖాస్తుల వెల్లువ
- పూర్తయిన ఇంటర్వ్యూలు
- మంజూరు ధ్రువీకరణ పత్రాల కోసం ఎదురుచూపులు

గోవిందరావుపేట: రాష్ట్ర ప్రభుత్వం రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా బీసీ, ఎస్సీ, ఓస్టీ, మైనార్టీ వర్గాలకు చెందిన నిరుద్యోగులకు సబ్సిడీపై రుణాలు అందించనుంది. ఈ పథకానికి మండలంలో భారీ స్పందన వచ్చింది. నిరుద్యోగులు ఆన్‌లైన్‌లో భారీగా దరఖాస్తు చేసుకున్నారు. పలుమార్లు సర్వర్ సమస్యలు తలేత్తినా మీ సేవా కేంద్రాల వద్ద క్యూలైన్ కట్టారు. మండలంలో 2188 దరఖాస్తులు వచ్చినట్లు సంబంధిత అధికారులు వెల్లడించారు.



దరఖాస్తుదారులకు సూచనలిస్తున్న అధికారులు(ఫైల్)

రాజీవ్ యువ వికాసం పథకంలో మండలంలోని ఎస్‌బీఐ గోవిందరావుపేట శాఖ ద్వారా 1101 మంది దరఖాస్తుదారులు, టీజీబీ పస్రా శాఖ ద్వారా 1087 మంది దరఖాస్తు దారుల లిస్ట్ విడుదల చేసి సర్టిఫికెట్లను పరిశీలించారు. ప్ర భుత్వం రూ.50 వేల నుంచి రూ.4 లక్షల వరకు యూనిట్లు మంజూరు చేయనుండటంతో ఆర్థిక సాయం కోసం లబ్ధిదారులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సిబిల్ స్కోరు కీలకం..

రాజీవ్ యువ వికాసం పథకానికి భారీగా దరఖాస్తులు వచ్చిన నేపథ్యంలో అదృష్టం ఎవరిని వరిస్తుందోనని ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. దరఖాస్తుదారుల్లో సిబిల్ స్కోరు కలవర పెడుతుంది. రాజీవ్ యువ వికాసం దరఖాస్తులను బ్యాంక్ అధికారులు కూడా పరిశీలన చేయాల్సి ఉంటుంది. సిబిల్ స్కోరు తక్కువ ఉన్న వారు, వ్యక్తిగత, వ్యవసాయ, గృహ, వాహన రుణాలు తీసుకోని తిరిగి చెల్లించని వారు అనర్హులుగా తేలే అవకాశం ఉంది. ఇప్పటికే ఆయా బ్యాంకుల వారీగా దరఖాస్తులను సిబిల్ స్కోర్ పరిశీలనకు పంపినట్లు అధికారులు చెబుతున్నారు. సిబిల్ స్కోరు వల్ల చాలా మంది దరఖాస్తులు రిజెక్ట్ అయ్యే అవకాశం ఉండడం గమనార్హం.

అర్హులందరికీ వర్తింపజేయండి..



రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పథకాన్ని అర్హులందరికీ అందజేయాలి. చాలా మంది యువత నిరుద్యోగంతో ఇబ్బంది పడుతున్నారు. నా డిగ్రీ కంప్లీట్ అయి 10 సంవత్సరాలు పూర్తి అయింది. మా లాంటి నిరుద్యోగులకు రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా లోన్ వస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. నేను ఫ్లోర్ మిల్ పెట్టుకోవడానికి రాజీవ్ యువ వికాసం పథకంలో దరఖాస్తు పెట్టుకున్నా.

- వెంకటరమణ, దరఖాస్తుదారుడు, చల్వాయి

పారదర్శకంగా ఎంపిక



ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ రుణాలను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి. ఇప్పటికే యూనిట్లకు సంబంధించి దరఖాస్తులను స్వీకరించా. వెరిఫికేషన్ ప్రక్రియ కూడా వేగంగా పూర్తి చేశాం. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ విభాగాలకు సంబంధించి యూనిట్లు ప్రభుత్వం నుంచి మంజూరవుతాయి. ఎంపిక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుంది.

- జవహర్ రెడ్డి, ఎంపీడీఓ, గోవిందరావుపేట